క్లుప్తంగా

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



పారిశుద్ధ్యం పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ రాధిక, తదితరులు

పూసపాటిరేగ: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని ఎంపీడీఓ ఎం.రాధిక అన్నారు. గ్రామీణ ప్రజలు పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. చల్లవానితోట పంచాయతీ యాతపేటలో పారిశుధ్య పనులను మంగళవారం పర్యవేక్షించారు. రానున్న వర్షాకాలంలో ఎటువంటి వ్యాధులు దరి చేరకుండా జాగ్రత్తలు పాటించాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. విద్యార్థుల తాగునీటి అవసరాలు తీర్చేలా కుళాయిని ఏర్పాటుచేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఆమె వెంట మండల పంచాయతీ అధికారి శ్రీనివాసరావు ఉన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



దెంకాడలో 'నేను బడికి పోతా' ర్యాలీ

డెంకాడ: బడిఈడు (6–18 సంవత్సరాల మధ్య) పిల్లలందరూ తప్పనిసరిగా బడిలోనే ఉండాలని మండల విద్యాశాఖాధికారి–2 వి.శ్రీరామ్ అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండలంలోని డెంకాడ గ్రామంలో విదాశాఖ అధికారులు, విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులందరికీ ఉచితంగా పుస్తకాలు, దుస్తులు తదితరవి ఉచింతంగా అందించడంతో పాటు రుచికరమైన మధ్యాహ్న భోజనం పెడుతున్నట్లు వివరించారు. పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ



విత్తనాలు అందజేస్తున్న అధికారులు

విజయనగరం రూరల్: మండలంలోని ద్వారపూడి గ్రామ రైతులకు జేడీఏ వీటీ రామారావు వరి విత్తనాలను మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం పీఎం కిసాన్ పథకం లబ్ధి ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని రైతులతో కలిసి టీవీలో వీక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎజ్జల ఆదిలక్ష్మి, ఎంఏఓ ఉమామహేశ్వరనాయుడు, మాజీ సర్పంచ్ వెన్ను శ్రీనివాసరావు, బి.నర్సింగరావు, పాల్గొన్నారు.

మాతా, శిశుఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న ఎంపీహెచ్ఈఓ ఎర్రన్న

గంట్యాడ: మాత,శిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీహెచ్ఈఓ కె.ఎర్రన్న ఆశవర్క ర్లు, అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాతా, శిశుసంరక్షణపై ఆశవర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బందికి మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. గర్భిణులను నెలనెలా క్రమం తప్ప కుండా పీహెచ్‌సీలకు తీసుకువచ్చి వైద్య తనిఖీలు చేయించాలని సూచించారు. ప్రతి గర్భిణీ ఆస్పత్రిలో ప్రసవించేలా చూడాలని కోరారు. శిశువు ల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి కనకలక్ష్మి

గజపతినగరం: స్థానిక ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టులో ఈనెల29న నిర్వహించనున్న జాతీయ లోక్అదాలత్ ను విజయవంతం చేయాలని జడ్జి బి.కనకలక్ష్మి పోలీసులు, న్యాయవాదులను కోరారు.స్థానిక కోర్టులో పోలీసులు, న్యాయ వాదులతో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీకాదగని సివిల్, క్రిమి నల్, తదితర కేసులను లోక్ అదాలత్‌లో కక్షిదారులు పరిష్కరించుకునేలా అవగాహన కల్పించాలని పోలీసులు, న్యాయవాదులకు సూచించారు.రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకుంటే ఇరువర్గాలకు మేలు జరుగుతుందని, లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రజలకు మెరుగైన సేవలు

- నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి
- స్టాండింగ్ కమిటీ సమావేశంలో 18 అంశాలకు ఆమోదం



కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్న మేయర్ విజయలక్ష్మి

విజయనగరం: ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు పూర్తిసహాయ సహకారాలు అందించాలని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి కోరారు. కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం మేయర్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో కమిషనర్ ఎం.ఎం.నాయుడు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, స్టాండింగ్ కమిటీ సభ్యులు పట్నాన పైడిరాజు, బోనెల ధనలక్ష్మి, పిన్నింటి కళావతి తదితరులు పాల్గొన్నారు. అజెండాలోని పొందుపరిచిన 18 అంశాలకు కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తి నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కాలపరిమితిలోపు అభివృద్ధి పనులు పూర్తిచేసి ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలన్నారు. నిర్లక్ష్యం వహించే సిబ్బంది పట్ల ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడా వర్షపు నీరు నిల్వ లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



హాజరైన అధికారులు, సిబ్బంది

కార్మికుల సమస్యల పరిష్కారానికి డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

విజయనగరం పూల్‌బాగ్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు పి.వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగరం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పంప్ హౌస్ కార్మికులకు మేన్ మెటీరియల్ వేరు చేసి కనీస వేతనాల జీఓ ఎంఎస్ నెంబర్ 7 అమలు చేయాలన్నారు. నాలుగు నెలల వేతన బకాయి తక్షణమే చెల్లించాలని కోరారు. విజయనగరం జిల్లాలో సంక్రాంతి కానుక రూ.1000 ఇంజినీరింగ్ కార్మికులకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఇంజినీరింగ్ కార్మికులు అత్యవసర సేవలు నిర్వహిస్తున్నారనే విషయాన్ని ప్రభుత్వాలు విస్మరించరాదని హితవు పలికారు. 10, 11వ పీఆర్సీలో ఇంజినీరింగ్ కార్మికులకు జరిగిన అన్యాయాన్ని 12వ పీఆర్సీలో సవరించాలని, జీఓ నంబర్ 1615 ప్రకారం జీతాలు చెల్లించేలా ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు ఎ. జగన్ మోహన్‌రావు, రాజు, ఆదినారాయణ, మురళి, నారాయణరావు, రఘు, సురేషు ధనంజయ, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతతో పనిచేద్దాం

- టీడీపీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: ఎన్నికల్లో అఖండ విజయాన్ని కట్టబెట్టిన ప్రజలపై అజమాయిషీ చేయకుండా బాధ్యతతో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని విజయనగరం ఎమ్మెల్యే పి.అదితిగజపతిరాజు అన్నారు. అశోక్ బంగ్లాలో మంగళవారం టీడీపీ విజయనగరం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతూ మనపై ఎంతో నమ్మకంతో ప్రజలు గెలుపు అందించారని, అంతే నమ్మకంతో నాయకులు వారి సమస్యలను అధికారులు, పార్టీ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చే వారు బొకేలకు బదులుగా బుక్స్, పెన్నులు తీసుకురావాలని, వాటిని విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌కు పసపాం విద్యార్థిని ఎంపిక

పూసపాటిరేగ: మండలంలోని పసపాం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన విదార్థిని జె. బార్గవి ఎస్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయింది. విద్యార్థికి ఇంటర్మీడియట్ పూర్తిచేసే వరకు ఏడాదికి రూ.12 వేలు చొప్పున కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందజేస్తుంది. విద్యార్థిని హెచ్ఎం ఆర్.నాగేశ్వరరావుతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

తూనిక యంత్రాలకు సీళ్లు



తూనిక యంత్రాలకు సీళ్లు వేస్తున్న అధికారులు

గుర్ల: మండలంలోని రేషన్ డిపోల్లో వినియోగిస్తున్న తూనిక యంత్రాలను లీగల్ మెట్రాలజీ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేసి, వాటిని సరిచేసి సీళ్లు వేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి తూనిక యంత్రాలను డీలర్లు మంగళవారం తీసుకువచ్చారు. వాటికి లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పె క్టర్ ఎం.దామోదర్ నాయుడు ఆధ్వర్యంలో సీళ్లు వేశారు. రేషన్ పంపిణీలో అధికారులు ధృవీకరించిన కాటాలను కాకుండా ఇతర కాటాలు వినియోగించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్టీసీని బలోపేతం చేయాలి

- కొత్త బస్సులొస్తేనే మహిళల ఉచిత రవాణా హామీ సాధ్యం
- ఏపీపీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్



మాట్లాడుతున్న యూనియన్ నాయకుడు

విజయనగరం అర్బన్: ప్రజలకు పూర్తి స్థాయిలో రవాణా సౌకర్యాన్ని అందించేందుకు అవసరమైన బస్సు రూట్లను పెంచి ఆర్టీసీ సంస్థను బలోపేతం చేయాలని ఏపీపీడీ(ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. స్థానిక జిల్లా పరిషత్‌లోని పంచాయతీరాజ్ మినిస్టీరియల్ సిబ్బంది సంఘం సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన సంఘం జోనల్ కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు పలువురు పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి ధామోదరరావు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఇచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలంటే ఇప్పుడున్న బస్సులు సరిపోవని, కొత్తగా బస్సులు కొనుగోలు చేసి బస్సు రూట్లను పెంచాలని సూచించారు. ఉద్యోగ ఖాళీలు భర్తీచేయాలన్నారు. ఉద్యోగులకు రావాల్సిన 2017 పీఆర్‌సీ బకాయిలు, కాంట్రాక్టు ఉద్యోగుల వేతన బకాయిలు పూర్తిగా చెల్లించాలని కోరారు. రిటైర్డ్ ఎంప్లాయీస్ మెడికల్ స్కీమ్‌ను ఇప్పుడు రిటైర్డ్ అవుతున్న వారికి కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. జోనల్ అధ్యక్షుడు కె.జె.శుభాకర్, జోనల్ కార్యదర్శి బి.కృష్ణమూర్తి సమక్షంలో జరిగిన సమావేశంలో సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పెంట భానుమూర్తి, రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ వెంకటరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.నానాజీ, జిల్లా అధ్యక్ష కార్యదర్శి జి.రవికాంత్, విజయనగం జోనల్ కమిటీ సభ్యులు, వివిధ డిపోలకు చెందిన కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

కమనీయం వేంకటేశ్వరస్వామి కల్యాణం



జామి: భీమసింగిలో వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు



జామి: భీమసింగిలో వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



లక్కవరపుకోట: కళ్లెంపూడిలో వేణుగోపాలస్వామి కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

జామి: మండలంలోని భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం రాత్రి వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ముందుగా స్వామివారికి అభిషేకాలు, మంగళస్నానాలు, ఎదురు సన్నాహం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేసి, స్వామివారిని, అమ్మవార్లను కల్యాణ వేదికపైకి తీసుకువచ్చి కల్యాణం జరిపించారు.అనంతరం ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. కుమరాం సర్పంచ్ పిన్నింటి ఆదిలక్ష్మి దంపతులు, టీడీపీ మండల అధ్యక్షుడు పి.స్వామినాయు డు దంపతులు, భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ సహకార చక్కెర కర్మాగారం ఎండీ విక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సంతాన వేణుగోపాలస్వామి కల్యాణం

లక్కవరపుకోట: మండలంలోని కళ్లెంపూడి గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఏడువాక శ్రీను ఆధ్వర్యంలో పురోహితులు ఐ.వి.సతీష్ తదితరులు స్వామి వారి కల్యాణం జరిపించారు. ఆలయ కమిటీ సభ్యులు దేముళ్లు,జోగారావు,జియో వ్యవస్థాపకులు, ప్రతినిధులు బి.రామకృష్ణ, విజయలక్ష్మి,వై.రవి,శ్రావణి, కళ్లెంపూడి గ్రామస్తులతో పాటు చుట్టు పక్క గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు

బొండపల్లి: నిర్జల ఏకాదశిని పురస్కరించుకుని దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలోఅర్చకులు దూసి శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బొండపల్లి: దేవుపల్లిలోరాజరాజేశ్వరీదేవిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్ద ఎత్తున భక్తులు మేళతాళాల మధ్య ఘటాలతో ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకాలు



స్వామివారి సన్నిధిలో పూజలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో మంగళవారం ఆంజనేయస్వామికి అర్చకులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. వేకువజామున సీతారామస్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత... ఆలయంలో స్వామి ముఖద్వారం వద్ద కొలువుదీరిన ఆంజనేయస్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో విశేష అభిషేకాలు జరిపించారు. అనంతరం నూతన వస్త్రాలతో సుందరంగా అలంకరించి తమలపాకులు, సింధూరంతో అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, రామగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటితో ఆరోగ్యం

- వైద్యాధికారి ప్రమీలాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రమీలాదేవి, తదితరులు

పూసపాటిరేగ: స్వచ్ఛమైన నీరు తాగడం వల్ల వ్యాధులు దరిచేరవని పూసపాటిరేగ పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రమీలాదేవి అన్నారు. పూసపాటిరేగ పీహెచ్‌సీలో మంగళవారం నీటి నాణ్యత, పర్యవేక్షణపై గ్రామస్థాయి ఫీల్డుటెస్ట్ కిట్ సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలుషితమైన నీరు తాగడం వల్ల డయేరియా, పచ్చకామెర్లు, టైఫాయిడ్‌వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు ఉమాపతి మాట్లాడుతూ నీటిని శుద్ధిచేసే ప్రాథమిక పద్ధతులు, కాలుష్య కారణాలను వివరించారు. వాటర్ ఎయిడ్ ఫెసిలిటేటర్లు వెంకటరమణ, అప్పలకొండమ్మలు మాట్లాడుతూ నీటి నాణ్యతను ప్రభావితం చేసే అంశాలు, నీటి నాణ్యత అంచనా ప్రమాణాలు, పంచాయతీ, బ్లాక్‌స్థాయి కమిటీ సభ్యుల పాత్ర, బాధ్యతలను విశదీకరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వేదమణి, సూపర్ వైజర్ నానమ్మ, ఆరోగ్య సహాయకులు ఆర్.వి.రమణ, బంగారు బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత బ్రెస్ట్ స్క్రీనింగ్ పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న తిరుమల ప్రసాద్

విజయనగరం ఫోర్ట్: ప్రాజెక్టు మలార్, రోటరీ క్లబ్ సంయుక్తంగా తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో ఈ నెల 19న ఉచిత బ్రెస్ట్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ఎం.డి తిరుమల ప్రసాద్ తెలిపారు. ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఎటువంటి రేడియేషన్ సమస్య లేని బ్రెస్ట్ ఎగ్జామినేషన్ డివైస్ బ్రెస్ట్ మాస్ మిషన్ సహకారంతో బ్రెస్ట్‌లో గల గడ్డలు ఉంటే కనిపెట్టవచ్చన్నారు. ఈ గడ్డలను ప్రాథమిక స్థాయిలో తెలుసుకుంటే నివారించుకోవడం సులభమని తెలిపారు. కార్యక్రమంలో తిరుమల ఆస్పత్రి మెడికవర్ సెంట్రల్ హెడ్ పద్మకుమార్, డాక్టర్ కృష్ణకాంతి, డాక్టర్ వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం



నవధాన్యాల విత్తనాలను రైతులకు అందజేస్తున్న జిల్లా, మండల అధికారులు

డెంకాడ: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎం.ఆనందరావు, జిల్లా అధికారి టి.సంగీత అన్నారు. మండలంలోని అమకాం రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ విధానాలను రైతులకు వివరించారు. ప్రధాన పంటల సాగుకు ముందు నవధాన్యాలు సాగు చేయడం వల్ల భూమికి కావాల్సిన సూక్ష్మపోషకాలు లభిస్తాయని తెలిపారు. నేలకు, ప్రకృతికి మేలు జరుగుతుందని, ఆరోగ్యకరమైన దిగుబడులు చేతికందుతాయన్నారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల మాట్లాడుతూ వరి విత్తనాలకు కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఎంటీయూ–1121 రకం వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల యాక్టివిస్ట్ బి.సుజాత, ఏఈఓ బి.రామకోటి, రైతులు పాల్గొన్నారు.

బీమా పరిహారం చెక్కు అందజేత



మృతురాలి మంగ కుమారుడికి బీమా చెక్కు అందజేస్తున్న ఏపీజీవీబీ మేనేజర్ జనార్దన్

వేపాడ: మండలంలో ఆతవ గ్రామానికి చెందిన బొడ్డు మంగ కుటుంబానికి ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమాయోజన (పీఎంజేజేబీవై)పథకం కింద రూ.2లక్షల బీమా పరిహారం మంజూరైంది. మృతురాలు మంగకు వేపాడ ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు(ఏపీజీవీబీ)లో ఖాతా ఉంది. ఆమె గతంలో పీఎంజేజేబీవై పాలసీ తీసుకున్నారు. ఇటీవలే మరణించడంతో బీమా వర్తించింది. నామినీ అయిన కుమారుడు సాయికి బీమా చెక్కును వేపాడ ఏపీజీవీబీలో మేనేజర్ జనార్దన్ మంగళవారం అందజేశారు. బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ శోభన్‌బాబు, క్యాషియర్లు చంద్రబా బునాయుడు, రామారావు, ఆతవ సీఎస్పీ కొటాన బంగారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



పెద్దవీధిలో దోమలమందు పిచికారీ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

శృంగవరపుకోట: స్థానిక పెద్దవీధిలో దోమల నివారణకు కొట్టాం పీహెచ్‌సీ సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసరావు నేతృత్వంలో ఏసీఎం- 3శాతం ద్రావణాన్ని పీహెచ్‌సీ సిబ్బం ది మంగళవారం పిచికారీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వల్ల ప్రమాదకర డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, దోమల నివారణకు ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఏసీఎం ద్రావణం పిచికారీ వల్ల దోమలను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో పిచికారీ చేయించుకోవాలని సూచించారు. ఈ ద్రావణం ప్రభావం 10 నుంచి 12 వారాల వరకూ ఉంటుందని చెప్పారు. వార్డు సభ్యులు చిప్పాడ శేషగిరిరావు, ఆరోగ్య పర్యవేక్షకులు రామసత్యం, ఆరోగ్య కార్యకర్తలు శంకర్, రామకృష్ణ, ప్రభావతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.